పుష్కర ఘాట్ల పరిశీలన

జన్నారం,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగూడ, రాంపూర్, బాదంపల్లి గోదావరి పుష్కరఘాట్లను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్‌షరీఫ్ బుధవారం పరిశీలించారు. 2027 సంవత్సరంలో గోదావరి పుష్కరాల నేపథ్యంలోపై అధికారుల ఉత్తర్వుల మేరకు పరిశీలించినట్లు వారు తెలిపారు.

15 నుంచి మంచిర్యాలలో వందే భారత్ హాల్టింగ్

మంచిర్యాల కలెక్టరేట్, బెల్లంపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్-సికింద్రబాద్ వందేభారత్ రైలు ఈ నెల 15 నుంచి మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఆగనున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ మార్గంలో నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు కొత్తగా మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇచ్చారు. నాగపూర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే సమయంలో మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ఉదయం 8.49 గంటలకు వస్తుందని, సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వైపు వెళ్లేటప్పుడు మధ్యాహ్నం 3.37గంటలకు వస్తుందని తెలిపారు. కాగా వందేభారత్ రైలు ప్రారంభమైనప్పటి నుంచి మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వలేదు. జిల్లా ప్రజల నుంచి హాల్టింగ్ ఇవ్వాలని రైల్వే ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు. ఎట్టకేలకు వందేభారత్ రైలుకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సొంతింటి కల నెరవేర్చేవరకు వరకు పోరాటం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఎన్నో సంవత్సరాలుగా కార్మికులు ఎదురు చూస్తున్న సొంతింటి కల నెరవేర్చేవరకు పోరాటం చేస్తామని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి ఎస్. వెంకటస్వామి, అల్లి రాజేం దర్‌లు తెలిపారు. బుధవారం కేకే 5 గనిపై బ్యాలెట్ ఓటు నమూనాలో పాల్గొనాలని ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ కేకే 5 గనిపై గురువారం బ్యాలెట్ బాక్స్ ఓటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సొంతింటి పథకం అమలు కావాలనే కార్మికులు ఓటు వేయాలని కోరారు. ఇన్‌కంటాక్స్ రద్దు, మారు పేర్ల మార్పు, తదితర వాటిని గుర్తింపు సంఘం హామీ ఇచ్చి మర్చిపోయిందన్నారు. కార్మికుల హక్కుల కోసం తమ సంఘం పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్మికులు పాల్గొన్నారు.

తగ్గనున్న వాహనాల ధరలు



- 10 శాతం జీఎస్టీ తగ్గడంతో దిగిరానున్న రేట్లు
- ఈ నెల 22 తరువాత తగ్గించిన జీఎస్టీ అమల్లోకి
- అప్పటి వరకు వేచి ఉండాలని కస్టమర్ల నిర్ణయం
- ప్రస్తుతం కొనుగోళ్లులేక వెలవెలబోతున్న షో రూములు
- సెకండ్ హ్యాండ్ మార్కెట్‌పైనా తీవ్ర ప్రభావం

మంచిర్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పలు రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో వాహనాల ధరలు సైతం తగ్గనున్నాయి. ఒక్కో వస్తువుపై కనీసం ఐదు శాతం నుంచి గరిష్టంగా 15 శాతం వరకు జీఎస్టీ తగ్గించడంతో ముఖ్యంగా వాహనాల ధరలు పెద్దమొత్తంలో తగ్గనున్నాయి. దీంతో కొత్తగా ద్విచక్ర వాహనాలు, కార్లు కొనుగోలు చేద్దామనుకుంటున్న కస్టమర్లు కొత్త జీఎస్టీ స్లాబులు అమల్లోకి వచ్చేదాక వేచి ఉండాలనే నిర్ణయంతో ఉన్నారు. ఈ కారణంగా ప్రస్తుతం కొనుగోళ్లులేక వివిధ వాహనాల షోరూంలు వెలవెలబోతున్నాయి. ప్రతీ వాహనంపై రెండుశాతం ట్యాక్స్ పెంచుతున్నట్లు ఆగస్టు 13న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆ రోజు నుంచే కొనుగోళ్లపై ప్రభావం కనిపించిందని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.

గణనీయంగా తగ్గనున్న ధరలు...

జీఎస్టీ స్లాబుల్లో జరిగిన మార్పులు ఈ నెల 22 తరువాత అమల్లోకి రానుండటంతో వివిధ రకాల వాహనాల ధరల్లో భారీ వ్యత్యాసం ఉండనుంది. కారు, బైకుల ధరలు 10శాతం వరకు తగ్గనున్నాయి. ఫలితంగా మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట లభించనుంది. ప్రతీ ద్విచక్ర వాహనంపై సగటున ఆరు వేల రూపాయలు మొదలుకొని గరిష్టంగా 20,000 రూపాయల వరకు ధరలు తగ్గనున్నాయి. కార్లపైన 80,000 రూపాయల నుంచి గరిష్టంగా రూ. 1.50లక్షల వరకు తగ్గనున్నాయి. వాహనాల ధరలు భారీ మొత్తంలో తగ్గనుండటంతో వినియోగదారులు ప్రస్తుతం కొనుగోళ్లను వాయిదా వేస్తున్నారు. జిల్లాలో ఏడెనిమిది రకాల కార్ల షో రూంలు ఉండగా, 20 వరకు బైక్ షోరూంలు ఉన్నాయి. ఆయా షోరూంల్లో వాహనాల కొనుగోళ్లు అధికంగానే ఉంటాయి. ముఖ్యంగా దసరా, దీపావళి వంటి పండుగ రోజుల్లో కొనుగోళ్లు గరిష్ట స్థాయికి చేరుతాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని షోరూంల్లో నెలకు సగటున కనీసం కోటి రూపాయల వరకు బిజినెస్ ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. మధ్యతరగతి ప్రజలు అధికంగా వినియోగించే వివిధ రకాల ద్విచక్రవాహనాలపై జీఎస్టీ 10 శాతం వరకు తగ్గనుండటంతో..

మిగతా 7లో..

యూరియా కోసం రైతుల పడిగాపులు



పద్దన్‌పల్లి పీఏసీఎస్‌లో యూరియా కోసం రైతుల క్యూలైన్

హాజీపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్దన్‌పల్లిలో పీఏసీఎస్‌లో బుధవారం పోలీసు పహారా మధ్య రైతులకు యూరియా బస్తాల పంపిణీ జరిగింది. ఉదయం ఐదు గంటలకే పద్దన్‌పల్లి పీఏసీఎస్‌కు వచ్చే రైతులు యూరియా కోసం నిరీక్షించారు. యూరియా రాగానే రైతుల తోపులాటలు జరుగకుండా ఎస్ఐ స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులను వరుస క్రమంలో ఉంచి యూరియా అందించారు. బుధవారం 222 మంది రైతులకు 444 బస్తాలు పంపిణీ చేశారు. బస్తాలు దొరకని 110మంది రైతులకు మరుసటి రోజు కోసం టోకెన్లు అందజేశారు.

దండేపల్లి: యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని, రైతులకు అవసరమైన యూరియాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందిస్తామని దండేపల్లి మండల వ్యవసాయాధికారి గొర్ల అంజిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం దండేపల్లిలో నెల్కి వెంకటాపూర్ సొసైటి ఆధ్వర్యంలో యూరియా కోసం వచ్చి రైతుల కోసం తాగునీరు, టెంటు, కుర్చీలను ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసుల బందోబస్తు నడుమ యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటి కార్యదర్శి పేరం వెంకటేష్, ఏఈవో మౌనిక, సొసైటి సిబ్బంది ఉన్నారు.

చెన్నూరు: మండలంలోని కిష్టంపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 222 యూరియా బస్తాలు వచ్చాయి. దీంతో బుధవారం రైతులు రైతు వేదిక వద్ద క్యూ కట్టారు. వ్యవసాయాధికారులు ఒక్కో రైతుకు ఒక్కో యూరియా బస్తాను పంపిణీ చేశారు. కాగా రైతులకు సరిపడినంత యూరియా సక్రమంగా అందించాలని రైతులు కోరారు.

సిరులు ఒడిసి పట్టు

- చెన్నూరు మండలంలో విస్తృతంగా పట్టుగూళ్ల పెంపకం
- 800 కుటుంబాలకు జీవనోపాధి

7



చెట్ల కొమ్మలపై పురుగులను వదులుతున్న రైతులు

నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మంచిర్యాల పట్టణంలోని కాలేజీ రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన సేవలందించేందుకు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టామన్నారు. వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు రూ. 216 కోట్ల నిధులతో నిర్మాణాలు చేపట్టామన్నారు. నిర్మాణపనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనూష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి: డీఈవో

చెన్నూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. బుధవారం చెన్నూరులోని కస్తూర్బా విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రణాళిక బద్ధంగా సిలబస్‌ను సకాలంలో పూర్తిచేయాలన్నారు. విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎంఈవో దత్తుకుమార్, ప్రిన్సిపల్ సుమలత ఉపాధ్యాయులు ఉన్నారు.

బెల్లంపల్లి డీఎల్‌పీవోగా కె సతీష్‌కుమార్

బెల్లంపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి డీఎల్‌పీవోగా కె. సతీష్‌కుమార్‌ను నియమిస్తూ పంచాయతీరాజ్ డైరెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పెద్దపల్లి జిల్లాలోని మంథని డీఎల్‌పీవోగా విధులు నిర్వహించారు. కాగా గతంలో కాసిపేట ఎంపీవో సర్దార్ అలీ ఇన్‌చార్జి డీఎల్‌పీవోగా ఉన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో డీఎల్‌పీవోగా సతీష్ కుమార్‌ను నియమించింది.

బీఆర్ఎస్ నాయకులపై దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులపై దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలుంటాయని, భవిష్యత్‌లో తమ పార్టీ అధికారంలోకి రాగానే అక్రమ కేసులు బనాయించిన అధికారులు, పోలీసులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కాలనీలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ నాయకులపై దాడులకు పాల్పడుతూ సామాన్య ప్రజలను భయాందోళనలకు గురి చేయడం వారికి ఫ్యాషన్‌గా మారిపోయిందన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న అధికారులు, పోలీసులపై తాము అధికారంలోకి రాగానే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. నస్పూర్‌లో జరిగిన వివాదంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కాటం రాజు, బేర సత్యనారాయణలపై కుట్ర పూరితంగా పోలీస్ స్టేషన్ ఎదుట కాంగ్రెస్ నాయకులు దాడి చేసి గాయపర్చడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో మంచిర్యాల,నస్పూర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, అక్కూరి సుబ్బన్న, తిరుపతి, రాజేందర్‌రెడ్డి, అత్తి సరోజ, అంకం నరేష్, సుధీర్, పల్లె భూమేష్,నల్మాసు కాంతయ్య పాల్గొన్నారు.

నాయకులకు పరామర్శ

నస్పూర్ సంఘటనలో గాయపడిన బీఆర్ఎస్ నాయకులు బేర సత్యనారాయణ, కాటం రాజులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా వారిని బుధవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, నాయకులు పరామర్శించారు. అంతకుముందు ప్లకార్డులతో నిరసన ర్యాలీ నిర్వహించారు.

నేడు విధుల్లో చేరనున్న జీపీవోలు

హాజీపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గ్రామపరిపాలన అధికారులు (జీపీ వో)లు విధుల్లో చేరనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జీపీవోలకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జిల్లాకు 120 జీపీవో పోస్టింగ్‌లు ఇచ్చారు. కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్యలు కౌన్సెలింగ్ నిర్వహించి క్లస్టర్ల వారీగా పోస్టింగ్‌లు ఇచ్చారు. జిల్లాలో 385 రెవెన్యూ గ్రామాలకుగానూ 168 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌కు జీపీవోను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం 120 మందిని నియమించగా త్వరలో 44 క్లస్టర్ల ఖాళీలను భర్తీ చేయనున్నారు.

తొందర పాటుతో భవిష్యత్‌ను కోల్పోవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు

నస్పూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలు రేపటి పౌరులుగా మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లాలని, తొందరపాటుతో భవిష్యత్‌ను కోల్పోవద్దని జిల్లా వైద్యాధికారి అనిత సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ కార్యక్రమంలో భాగంగా నస్పూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు బుధ వారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధి కారి అనిత మాట్లాడుతూ ఏదైనా సమస్య వచ్చినప్పుడు దాని పరిష్కారం కోసం ప్రయత్నించాలన్నారు. దానినే మనసులో పెట్టుకుని మానసికంగా కుంగిపోయి కొత్త సమస్యలను తెచ్చి పెట్టుకుని చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా జీవితంలో ఎదగడానికి ఆలోచనలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పాల ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునిల్, మానసిక వైద్య నిపుణులు లింగారెడ్డి, పద్మ, డీపీహెచ్ నాందేవ్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

అవకతవకలపై ప్రభుత్వానికి నివేదిక



ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఏసీబీ డీఎస్పీ మధు

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం సాయికుంట ప్రభుత్వ గిరిజన ఉన్నత బాలికల పాఠశాలలో బుధవారం ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధుతో పాటు ఏసీబీ బృందంతో పాటు లీగల్ మెట్రాలజీ, సీనియర్ అడిటర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మధు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశామన్నారు. రికార్డుల్లో అవకతవకలు ఉన్నాయని, సరైన శానిటేషన్, నిర్వహణ లేదన్నారు. వీటన్నింటిపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. ఎవరైన లంచం అడిగితే 1064 లేదా వాట్సాప్ నంబర్ 9440446106 నంబరుకు సమాచారం అందిచాలని, బాధితులు, ఫిర్యాదుదారుడి పేరుగోప్యంగా ఉంచుతామని తెలిపారు.

విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి

ఎమ్మెల్సీ మల్క కొమురయ్య



జైపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరగౌడ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా పక్షం 2025 జిల్లాస్థాయి కార్యశాల సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని మండలాల్లో బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పలు సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ నెల 17న ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్టోబరు 2 వరకు అన్ని గ్రామాల్లో రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్, మహిళలకు ముగ్గుల పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా నాయకులు ముందుకు సాగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు కృష్ణమూర్తి, వెంకటేశ్వర్‌రావు, ఏమాజీ, రమేష్, పురుషోత్తం, మల్లేష్, మల్లికార్జున్,రాకేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

జైపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్థానికసంస్థల ఎన్నికల సమావేశానికి అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమస్యలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. పలు గ్రామాలకు చెందిన కొంత మంది యువకులు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు కృష్ణమూర్తి, వెంకటేశ్వర్‌రావు, దూట రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

కోటపల్లి: మండలంలోని కొండంపేట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు బుధవారం బీజేపీ మండల జనరల్ సెక్రెటరీ వడ్లకొండ రాజేష్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. మంచిర్యాలలో జరిగిన కార్యక్రమంలో వీరికి ఉమ్మడి జిల్లా టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, జనరల్ సెక్రెటరీ దుర్గం అశోక్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు మంత్రి రామయ్య, నాయకులు కాశెట్టి నాగేశ్వర్‌రావు, కందుల వెంకటేష్, పెద్దింటి లచ్చన్న, అడ్లూరి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 15 నుంచి నిర్వహించే సదరం శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15,18,22,23 తేదీల్లో లోకో మోటర్, 16న సికిల్ సెల్, 17, 24 తేదీల్లో వినికిడిలోపం, 25న మానసిక ఆరోగ్యం, 26న దృష్టి లోపం సంబంధిత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు మీ సేవ కేంద్రాల్లో స్లాట్‌బుక్ చేసుకుని సంబంధిత పత్రాలతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హాజరు కావాలని కోరారు.

యువకుడి మృతదేహం లభ్యం


రాజేష్‌యాదవ్(ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని అక్బర్‌నగర్‌కు చెందిన రాజేష్ యాదవ్ మృతదేహం లభ్యం అయినట్టు ఎస్సై శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆరో తేదీన గణపతి నిమజ్జనంలో ప్రమాద వశాత్తూ ఇందారం గోదవరి బ్రిడ్జిపై నుంచి కాలుజారి గోదావరి నదిలో పడి గల్లంతు కాగా బుధవారం రాజేష్ యాదవ్ మృతదేహం లభించింది. మృతదేహం మండలంలోని శివ్వారం గోదావరి పరివాహక ప్రాంతం నది ఒడ్డున మృతదేహం కనిపించగా స్థానిక రైతులకు తమకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో అక్కడకు వెళ్లి రాజేష్ యాదవ్ మృతదేహంగా గుర్తించామన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

625 గ్రాముల బంగారం స్వాధీనం

చెన్నూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ-2 బ్యాంకులో జరిగిన భారీ స్కామ్‌లో బుధవారం పోలీసులు మరో 625 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలోని ముత్తూట్ ఫిన్‌కార్ప్ బ్యాంకు నుంచి చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్ తాకట్టు పెట్టిన 625 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. గత నెల 20న చెన్నూరు ఎస్‌బీఐ-2లో భారీ స్కామ్ బయటపడగా అందులో పనిచేసే క్యాషియర్ రవీందరే గోల్డ్ లోన్ తాకట్టు పెట్టిన 20 కిలోల బంగారాన్ని మాయం చేశాడు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కేసు విచారణ చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని 15 కిలోల 23 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. కాగా మిగిలిన బంగారం కోసం చెన్నూరు, మంచిర్యాల పట్టణాల్లోని ముత్తూట్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, ముత్తూట్ మిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని స్వాధీనం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా బుధవారం పట్టణంలోని ముత్తూట్ ఫిన్‌కార్ప్ బ్యాంకు నుంచి 625 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

లక్షెట్టిపేట సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మురిమడుగు మల్లయ్య (58)అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఆయ తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు కొంత కాలంగా అనారోగ్యంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆ క్రమంలో ఈనెల తొమ్మిదో తేదీన మధ్యాహ్నం మృతుడు తన ఇంటి పరిసర ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లగా అతని నోటిలో నుంచి నురుగులు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు మల్లయ్య కొడుకు అరుణ్ ఫిర్యాదు చేయగా, ఎస్సై-2 రామయ్య కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కోన్నారు. కాగా మల్లయ్య పాము లేదా తేలు కాటుకు మృతి చెందడా, అనారోగ్యంతో మృతి చెందాడా అనే విషయం దర్యాప్తులో తేలుతుందని తెలిపారు.

ముట్టడికి తరలివెళ్లిన నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు గురువారం నిర్వహించే కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ముట్టడికి తరలివెళ్లారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డి. బ్రహ్మానందం మాట్లాడుతూ, హై పవర్ కమిటీ వేతనాలు అందించాలని, 15 శాతం లాభాల వాటా అందించాలని, సులబ్ కాంప్లెక్సుల్లో పనిచేసే వారికి ఈఎస్‌ఐ, ఈపీఎఫ్, బోనస్ అమలు చేయాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. వాటి సాధనకు గురువారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, శేఖర్, శంకర్, సుధాకర్, కొమురయ్య, లక్ష్మణ్, రాజేందర్, ఓదెలు, రమేష్, ఈశ్వర్, శ్రీనివాస్, జ్యోతి, లక్ష్మీ, సుగుణ, దివ్య, రమ, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జైనూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంలొద్ది కేజీబీవీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంగ్లీష్ బోధనకు మహిళా అభ్యర్థులు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవి ప్రత్యేక అధికారి సుమలత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంగ్లీష్ సబ్జెక్టులో ఎంఎ బీఈడి పూర్తి చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారు అర్హులని తెలిపారు.

తాగునీటి సరఫరా అస్తవ్యస్తం..

● రెండు రోజులకోసారి నీటి సరఫరా ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు


బుదరగూడలో రాస్తారోకో చేస్తున్న మహిళలు (ఫైల్)

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండల పరిధిలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గత ప్రభుత్వం హయాంలో రెండు పూటల మంచినీరు అందించారు. పండుగ సమయాల్లో మంచినీటి కొరత లేకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం రెండు పూటల కాదు కదా..కనీసం రెండు రోజులకోసారి కూడా మంచి నీరు సరిగ్గా అందడం లేదు. కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే నీటిని గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆయా వాడలకు నీరందడం లేదని ఆరోపణలున్నాయి. గత 15 రోజులుగా మంచినీటి సరఫరా సరిగ్గా జరగడం లేదు. కొమ్రంభీం జిల్లా వ్యాప్తంగా మంచినీరు సరఫరాకు అడ ప్రాజెక్టు నీరే ప్రధానం. అడ ప్రాజెక్టు నీటి సరఫరా విభాగంలోని కాంట్రాక్టు కార్మికులు, సిబ్బంది సమ్మె చేయడం వల్లనే నీటి సరఫరాలో జాప్యం జరుగుతుం దని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. వేత నాలు సమస్య కారణంగా కార్మికులు కొద్ది రోజుల పాటు సమ్మె చేశారు. సమ్మె ప్రభావం తోనే మంచినీటి సరఫరాలో ఇబ్బంది ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

పెద్దవాగుతో పాటు..

కాగజ్‌నగర్ పట్టణానికి పెద్దవాగుతో పాటు అడ ప్రాజెక్టు నీరు సరఫరా అవుతోంది. అడ ప్రాజెక్టు నీటిని శుద్ధి చేసి మిషన్ భగీరథ పథకం ద్వారా త్రిశూల్ పహాడ్‌పై గల రిజర్వాయర్‌లోకి నింపుతారు. పట్టణానికి 11ఎంఎల్‌డీ (రోజుకు అవసరమైన మెగా లీటర్లు) నీరు అవసరం అవుతుంది. 7 ఎంఎల్‌డీ లు అడ ప్రాజెక్టు ద్వారా, 4 ఎంఎల్‌డీలు పెద్దవాగు ఇంటేక్ వెల్ ద్వారా సరఫరా జరుగుతోంది. కానీ పెద్దవాగు నుంచి సరఫరా అయ్యే మంచినీటి సరఫరాలోనూ అంతరాయం ఏర్పడుతోందని పట్టణవాసులు చెబుతున్నారు. నెలలో కేవలం 20 రోజులు మాత్రమే పట్టణంలో నీటి సరఫరా సక్రమంగా జరుగుతోంది. మిగిలిన రోజుల్లో సిబ్బంది నిర్లక్ష్యంతో పాటు పైపులైన్ లీకేజీలు తరచు జరుగుతున్నాయి. వర్షాకాలంలోనే ఈవిధంగా ఉంటే వేసవి కాలంలో ఎలా ఉంటుందనేది పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంచినీరు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని చింతగూడ, కోయవాగు, రాస్‌పెల్లి, బోరిగాంతో పాటు పలు గ్రామాల్లో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ఆయా గ్రామ పంచాయతీల్లో నెలల తరబడి బోర్లు చెడిపోయి ఉండడంతో పాటు, పైపు లైన్లు సక్రమంగా వేయకపోవడంతో సరఫరాలో అంతరాయం కలుగుతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. బుదరగూడ, వంజీరీ గ్రామం పంచాయతీల్లోని ఆయా గామాల ప్రజలు మంచినీటి సరఫరాలో అంతరాయంతో ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. మహిళలు బిందెలతో నీటిని దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉంది. పలు గ్రామ పంచాయతీల్లోని అంతర్గత పైపులైన్లు, ఇతరత్ర ఇబ్బందులతోనే సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని మిషన్ భగీరథ ఏఈ పృథ్వీ తెలిపారు. నిత్యం మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందజేత

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో పాటు కార్యవర్గాన్ని కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాయంలో కలిసి పుషగుచ్ఛం అందజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు.


పుష్పగుచ్ఛం ఇస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే


ఉత్తమ ఉపాధ్యాయులతో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురష్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా విద్యశాఖ అద్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్, ఇన్‌చార్జీ డీఈఓ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి హజరై సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యా ర్థులతో ముడిపడి ఉందని విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. జిల్లాలో భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా మారుమూల గ్రామాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ అంకిత బావంతో పని చేస్తున్నారన్నారు. జిల్లాలో పదోతరగతి వార్షిక పరీక్షల్లో పురోగతి సాధించా లని, సూచించా రు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన నలుగురు పీజీ హెచ్‌ఎంలు, 22 స్కూల్ అసిస్టెంట్లు, 14 మంది ఎస్జీటీలు, ముగ్గురు కేజీబీవీ ఉపాధ్యాయులు, ఇద్దరు ఈఆర్పీలు, 13 మంది గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, విద్యాశాఖ అధికారి ఉదయ్ బాబు, బీసీ సంక్షేమాధికారి సజీవన్, పీఏసీఎస్ చైర్మన్ ఆలీబీన్ అహ్మద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్టడీ టూర్ ఉపయోగకరం


మహానది కోల్‌ఫీల్డ్ డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్‌తో పాటు నైని బ్లాక్‌ను సందర్శన ఉపయోగకరంగా ఉందని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య అన్నారు. మహానది కోల్‌ఫీల్డ్‌లో బొగ్గు ఉత్పత్తి, రక్షణ, సంక్షేమానికి సంబంధించి అక్కడ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు, అమలు, నిర్ణయాలను పూర్తిగా పరిశీలించామని అన్నారు. స్టడీ టూర్‌లో భాగంగా మూడు రోజులుగా ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్‌తో పాటు నైని బ్లాక్‌ను సందర్శించారు. చంబల్‌పూర్ గెస్ట్‌హౌజ్‌లో ఎంసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో డైరెక్టర్ హెచ్‌ఆర్ పర్సనల్‌కేశవరావును కలిసి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పనిచేస్తున్న ఉద్యోగులు 20,730 మంది ఉన్నారని తెలిపారు. 16 వేల మందికి క్వార్టర్లకేటాయింపు చేపట్టారని తెలిపారు. మహిళా కార్మికులకు కూడా డంపర్, షావెల్, బ్లాస్టింగ్ ఆపరేటర్లుగా విధులు నిర్వహించడం గర్వకారణమన్నారు. మూడుకేంద్రీయ విద్యాలయాలు,మెరిట్ స్కాలర్‌షిప్ అందిస్తున్నారని, వైద్య సౌకర్యాలు కూడా బేషుగ్గా ఉన్నాయని సమ్మయ్య తెలిపారు. స్టడీ టూర్ తమకెంతగానో ఉపయోగకరంగా ఉందని కాంపెల్లి సమ్మయ్య అనంతరం డైరెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు త్యాగరాజన్, శంకర్‌రావు, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డిజిటల్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) సత్యనారాయణ అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునాతమైన సాంకేతికతతో బోధిస్తున్న డిజిటల్ తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవోలు వాసాల ప్రభాకర్, తోట రమేష్, వెంకట రాజయ్య, ప్రమీలదేవి, పర్వతచంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15 నుంచి కబడ్డీ పోటీలు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): సిర్పూరు మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు స్మారక కబడ్డీ పోటీలు కాగజ్‌నగర్ సర్‌సిల్క్ గ్రౌండ్‌లో ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 13వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. మొదటి బహుమతి రూ. 50 వేలు, రెండో బహుమతి రూ.25వేలు, మూడో బహుమతి రూ.15 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. పేర్లు నమోదు చేసుకునే వారు మాజీ కౌన్సిలర్ బాల్యశ్యాం 8519961666, 738 647691 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైల్వేస్టేషన్ తనిఖీ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌ను బుధవారం డీఆర్‌ఎం గోపాలకృష్ణన్ తనిఖీ చేశారు. త్వరలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్లాట్ ఫాంలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను, రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలను చేశారు. సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకన్నారు.

పని స్థలాల పరిశీలన

రెబ్బెన, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్టులో బుధవారం డైరెక్టర్ వెంకటేశ్వర్లు పర్యటించి ఖైరిగూడ ఓసీ పనిస్థలాలను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఏర్పడిన ముందస్తు చర్యలపై జీఎం విజయభాస్కర్ రెడ్డితో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం లో ఖైరగూడ పీవో మచ్చగిరి నరేందర్, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్ల పట్టివేత

రెబ్బెన, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలంలోని అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ గంగాధర్ తెలిపారు. మోటార్ వెహిక్ ఇన్‌స్పెక్టర్ అధికారుల ఆధ్వర్యంలో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

రక్షణ సూత్రాలు పాటించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): ప్రమాదాల నివారణకు రక్షణ సూత్రాలు తప్పక పాటించాలని జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. ఆర్‌కే 6, ఆర్‌కే 7 గనులు రక్షణలో బహుమతులు సాధించిన సందర్భంగా ఆయన ఆయా గనులను సందర్శించి ఉద్యోగులను అభినందించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, ప్రతి ఉద్యోగి తమ పనిస్థలాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల్లో సింగరేణికి చెందిన నాలుగు గనులు అవార్డులు సాధించడం అభినందనీయమన్నారు. ఆయా కార్యక్రమాలలో గ్రూప్ ఏజెంట్లు శ్రీధర్, రాజేందర్, ఆర్‌కే 7 గని మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, చిలుక రాంచందర్, గొర్రె నర్సయ్య, సురేష్, రమేష్, రక్షణ, సంక్షేమాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌పీ 1 మేనేజర్ తీరు మార్చుకోవాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 10 (ఆంధ్ర జ్యోతి) : ఎస్‌ఆర్‌పీ 1 గని మేనేజర్ తీరు మార్చుకోవాలని హెచ్‌ఎంఎస్ సింగరేణి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్ రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆత్మారాం సహాని మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కార్మికులతో చట్టవిరుద్ధంగా వెట్టి చాకిరీ చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. మస్టర్ పడిన తరువాత కార్మికులతో గని ఆవరణలో శ్రమదానం చేయిస్తున్నాడన్నారు. దానికి కొంత సమయం పోగా, కార్మికులు సిద్ధమై వచ్చేసరికి మ్యాన్ రైడింగ్ నిలిపివేయిస్తున్నాడన్నారు. దీని వల్ల కార్మికులు నడిచి గనిలోకి దిగాల్సి వస్తోందని తెలిపారు.

క్రీడలకు పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తాం


క్రీడలను ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తామని శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఇంటర్ డిపార్ట్‌మెంట్ వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వార్షిక క్రీడలను శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో బుధవారం ఆయన ప్రారంభిచారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రీడాస్ఫూ ర్తితో ఆటల్లో పాల్గొనాలని, కోల్ ఇండియా క్రీడల్లో అన్ని అంశాల్లో శ్రీరాంపూర్ ఏరియా ముందుండాలన్నారు. ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య మాట్లాడుతూ క్రీడాకారులకు నైపుణ్యం ఉన్నా శిక్షణ అవసరమని, రెండు రోజజుల పాటు శిక్షణ ఇవ్వాలని సూచించారు భూపాలపల్లి ఏరియాలో ఉత్తమమైన జిమ్ ఏర్పాటు చేశారని, శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే మూడేళ్ల క్రీడా సామగ్రి అందుబాటులోకి రావడం లేదని, వెంటనే పంపిణీ చేయాలని కోరారు. మొదటి రోజు వాలీబాల్ మ్యాచ్‌లు జరుగగా, మొదటి మ్యాచ్‌లో అదర్స్ జట్టు, ఆర్‌కే 7/న్యూటెక్ జట్టు పోటీ పడగా ఆర్‌కే 7/న్యూటెక్ జట్టు విజయం సాధించింది. అలాగే రెండవ మ్యాచ్‌లో ఆర్‌కే 5/6 జట్టు, ఎస్‌ఆర్‌పీ 1/3 జట్లు పోటీ పడగా ఆర్‌కే 5/6 జట్టు గెలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ఆర్‌కే 7/న్యూటెక్ జట్టు విన్నర్‌గా, ఆర్‌కే 5/6 జట్టు రన్నర్‌గా నిలిచాయి. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) ఎస్ అనిల్‌కుమార్, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి స్వజన్ పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సకినాల నర్సయ్య, జనరల్ కెప్టెన్ ఎం శ్రీనివాస్, వాలీ బాల్ కెప్టెన్ బి చిన్నన్న పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట వేయాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బొగ్గు బావుల్లో పని చేస్తున్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి పెద్దపీట వేయాలని ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య అన్నారు. బుధవారం మందమర్రి, రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన మధూకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో ఉన్నటువంటి వైద్యులు, సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిని ఏరియాలోనే పెద్ద ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ఖాళీగాఉన్న పోస్టుల గురించి సింగరేణి సీఎండీతో మాట్లాడుతామన్నారు. ఎప్పటికప్పుడు ఆసుపత్రికి వచ్చే రోగుల ఆరోగ్య స్థితిగతుల గురించి పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. త్వరలోనే హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆసుపత్రి నిర్మాణం చేయబోతున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు కూడ సకాలంలో మందులు అందేలా చూడాలని ఆయన అన్నారు. వీలైనంత త్వరగా ఏరియా జీఎంతో కలిసి ఏరియా ఆసుపత్రిలో సమావేశంలో నిర్వహించాలని కోరారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, ఇప్పకాయల లింగయ్య, కంది శ్రీనివాస్, పెద్దపల్లి బాలయ్య, రమణ, గాండ్ల సంపత్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో సింగరేణి డైరెక్టర్ పర్యటన


మొక్కలు నాటుతున్న డైరెక్టర్ తిరుమల్‌రావు

జైపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని ఎస్టీపీపీలో సింగరేణి డైరెక్టర్ ఈఅండ్‌ఎం తిరుమల్‌రావు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు పూల మొక్కను అందించి స్వాగతం పలి కారు. అనంతరం ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ పవర్ ప్లాంటుకు సంబంధించిన వివరాలు, విద్యుత్ ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్లాంటు నిర్వహణ బాగుందని అన్నా రు. ఎస్టీపీపీకి వచ్చిన అవార్డుల పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అధికా రులను అభినందించారు. ప్లాంటు ఉత్పత్తి, ఉత్పాదకతను ఇలాగే కొనసా గించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్లాంటు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈడీ చిరంజీవి, డైరెక్టర్ ఎస్‌వో టూ రామమూర్తి, అధికారులు నర్సింహారావు, సముద్రాల శ్రీనివాస్, మురళీధర్, మదన్‌మోహన్, శ్రీనివాస్, అజాజుల్లాఖాన్, పంతుల, కిరణ్‌బాబు, చంద్రమణి పాల్గొన్నారు.



ఏరియా అభివృద్ధే ప్రధాన లక్ష్యం


మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి) : మందమర్రి ఏరియా అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని జీఎం రాధాకృష్ణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్ధే శించిన 30 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనే లక్ష్యంగా కార్మికులు, అధికారులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. రైల్వే సైడింగ్ పనులను వర్షాల వల్ల కొంత అంతరాయం కలుగుతుందని, వీలైనంత త్వరగా పనుల వేగవంతానికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. కార్మిక వాడల్లో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.


ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

కాసిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను కార్మికులు, అధికారులు సమిష్టిగా అధిగమించేందుకు కృషి చేయాలని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ అన్నారు. బుధవారం కాసిపేట 1వ గనిని సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రూపు ఏజెంట్ రాంబాబు, మేనేజర్ సతీష్, సేఫ్టీ అధికారి నిఖిల్ అయ్యర్, డిప్యూటి మేనేజర్ వెంకటేష్, సంక్షేమాధికారి మీర్జాగౌస్‌ఖాన్, అండర్ మేనేజర్ హిమాలయ, సర్వేయర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వృత్తి శిక్షణ పరీక్షలు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు సీఈఆర్ క్లబ్‌లో, నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో పరీక్షలు నిర్వహించారు. టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ డీటీపీ వంటి వృత్తి విద్యా కోర్సులు నేర్చుకున్న వారిలో 619 మందికిగాను 530 మంది పరీక్షలకు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా సేవా అధ్యక్షురాలు ఉమారాణి హాజరయ్యారు.. కార్యక్రమంలో సీనియర్ పీవో మురళీ, సేవా సమితి చీఫ్ కో ఆర్డినేటర్ డి.ఎస్. శివకుమార్, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి పాల్గొన్నారు.

సిరులు ఒడిసి పట్టు


పట్టుగూళ్లను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

మల్బరీ సాగు.. మల్బరీ సాగు కోసం రైతులకు రాయితీలు ప్రభుత్వం అందిస్తోంది. ఎకరానికి 5,500 మొక్కలు అవసరం అవుతుండగా మల్బరీ విత్తన కేంద్రంలో రెండు రూపాయలకు ఒక మొక్క చొప్పున లభిస్తాయి. మొక్కలు నాటిన మూడు నెలల్లో తోట కోతకు వస్తుంది. ఆ తర్వాత మల్బరీ పురుగులు పెంచితే నెల వ్యవధిలోనే పంట చేతికి వస్తుంది. ప్రతీ పంటకు దాదాపు 35,000 రూపాయల నుంచి 40,000 రూపాయల ఆదాయం వస్తుంది. పట్టు పురుగుల పెంపకం తేలికైందని, కుటుంబమంతా కలిసి చేసుకుంటే మంచి ఆదాయం వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. మల్బరీ తోట సాగు చేసి ఆకులు కోత దశకు చేరుకోగా పట్టు పురుగులకు సంబంధించిన గుడ్లను ఇతర ప్రాంతాల నుంచి అధికారుల ద్వారా తెప్పించుకుంటారు. పట్టుగూళ్లను విక్రయించడానికి హైద్రాబాద్‌లోని తిరుమలగిరి, జనగామ జిల్లా కేంద్రంలో కేంద్రాలు ఉన్నాయి.


ఏరుమద్ది చెట్ల కొమ్మలపై పురుగులు

- చెన్నూరు మండలంలో విస్తృతంగా పట్టుగూళ్ల పెంపకం
- 800 కుటుంబాలకు జీవనోపాధి

చెన్నూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు దసరి పట్టు పరిశ్రమ వరంగా మారింది. దాదాపు 800 మంది రైతులు పట్టు గూళ్ల పెంపకంలో ఉపాధి పొందుతున్నారు. ఐదు నెలల కాలంలోనే పంట చేతికి వస్తుండడంతో రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రభుత్వం మరిన్ని వస తులు కల్పిస్తే మంచి దిగుబడి సాధిస్తామని రైతులు చెబుతున్నారు.

ఆరు దశాబ్దాలుగా

ఈ ప్రాంత రైతులు 60 సంవత్సరాలుగా పట్టు గూళ్లను పెంచుతున్నారు. తక్కువ కాలంలో పంట తీసే అవకాశం ఉండడంతో ఈ దిశగా మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం మండలంలో దాదాపు 80 హెక్టార్లలో పట్టుగూళ్లు పెంచుతున్నారు. ఒక పంట కాలంలో దాదాపు కోటి పత్తి గూళ్లను ఉత్పత్తి చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తున్నారు. ఈ పంట పండించే వారిలో 80 శాతం గిరిజన రైతులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి, నెన్నెల, కౌటాల, బెజ్జూరు, ఉట్నూరు, ఖానాపూర్ మండలాల్లో పట్టుగూళ్ల పెంపకం జోరుగా సాగుతుంది. పట్టుగూళ్లను రిజర్వు ఫారెస్టులోని ఏరుమద్ది, నల్లమద్ది, తెల్లమద్ది చెట్లపై పెంచుతారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ఇప్పుడిప్పుడే రైతులు మల్బరీ తోటల్లో కూడా పెంచుతున్నారు. పట్టు పరిశ్రమశాఖ రైతులకు జూన్‌లో 50 శాతం సబ్సిడీ కింద పట్టు పురుగుల గుడ్లను పంపిణీ చేస్తుంది. రైతులు ఈ గుడ్లను వెదురు బుట్టల్లో పోసి మద్ది ఆకులు కప్పుతారు. గుడ్ల నుంచి చిన్నచిన్న పురుగులు వచ్చి ఆకులు తింటూ పెరుగుతాయి. ఈ పురుగులు పెరిగాక వాటిని మద్ది చెట్ల కొమ్మల పైకి ఎక్కిస్తారు. ఈ పురుగులు చెట్ల పై ఉన్న ఆకుల్ని తింటూ పెరిగి పెద్దగా అవుతాయి.

అనంతరం పురుగుల ఒక చెట్టు కాడను ఆధారంగా చేసుకుని తన నోటి నుంచి ఒక రకమైన పదార్థాన్ని విడుదల చేస్తూ గూడు కట్టుకుంటాయి. ఇలా తయారైన గూళ్లను రైతులు సేకరిస్తారు. మొదటి పంట 30 నుంచి 35 రోజులు, రెండో పంట 45 రోజులకు మూడో పంట 65 రోజులకు వస్తుంది. ఇలా తయారైన గూళ్లను హాట్ ఎయిర్ డ్రయర్ యంత్రం ద్వారా వేడిచేస్తే లోపల ఉన్న పురుగు చనిపోతుంది. అనంతరం పట్టు గూళ్లను ఎండబెట్టి శుభ్రపర్చి విక్రయిస్తారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, ఒడిశా రాష్ట్రల నుంచి వ్యాపారులు వచ్చి బహిరంగ వేలంపాట ద్వారా పట్టుగూళ్లను కొనుగోలు చేస్తారు. ఒక సీజన్‌లో రైతులు రెండు వేల రూపాయల పెట్టుబడితో దాదాపు 30 వేల రూపాయల వరకు సంపాదిస్తారు.


ఆరబెట్టిన పట్టుగూళ్లు

బేసిక్‌సీడ్ మల్టిఫికేషన్ కేంద్రం

చెన్నూరు మండలంలోని లంబాడిపల్లిలో పట్టు పురుగుల బేసిక్‌సీడ్ మల్టీఫికేషన్ కేంద్రం ఉంది. ఇక్కడ నుంచి నాణ్యమైన గుడ్లను ఉత్పత్తి చేసి రైతులకు పంపిణీ చేస్తారు. చెన్నూరు ప్రాంతంలో పట్టు గూళ్ల పెంపకం కోసం సెంట్రల్ స్టేట్ ప్రోగ్రాం క్యాటలిటిక్ డివలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఏరుమద్ది, నల్ల మద్ది, మల్బరీ తోటలను పెంచేందుకు ప్రభుత్వం అన్ని రాయితీలు కల్పిస్తుంది. రైతులకు మహిళ కిసాన్ సశక్తీకరణ్ పరి యోజన కింద చెట్లు, స్ప్రేయర్స్‌ను పంపిణీ చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు

కేంద్ర ప్రభుత్వం పట్టు పరిశ్రమను ప్రోత్సహించడంలో భాగంగా రైతులకు సబ్సిడీలు అందిస్తుంది. పట్టుపురుగులు పెంచేందుకు నిర్మించే షెడ్లుకు, మందులు, పట్టుగూళ్లను రైతులకు సబ్సిడీపై అందిస్తుంది. కేంద్రప్రభుత్వం సబ్సిడీ ఇతర రూపాల్లో అధికంగా సహాయం చేయడంతో పాటు పట్టు పరిశ్రమ రంగం వైపు రైతులు అడుగులు వేస్తున్నారు.

పట్టుగూళ్ల పెంపకంతో మంచి ఆదాయం : రాథోడ్ పార్వతి, పట్టుపరిశ్రమ శాఖ సహాయ సంచాలకులు , చెన్నూరు



పట్టు పురుగుల పెంపకం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందవచ్చు. మల్బరీ తోటలను సాగు చేసి పట్టు పురుగుల పెంపకం చేపట్టవచ్చు. జిల్లాలో ఈ సారి 150 ఎకరాల్లో మల్బరీ సాగు లక్ష్యంగా నిర్దేశించాం. దానికి అనుగుణంగా రైతులను ఎంపిక చేసి మల్బరీ సాగు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా ఎదగాలి.

మంత్రిని కలిసిన యాదవ సంఘం నేతలు


మంత్రి వివేక్‌తో యాదవసంఘం అధ్యక్షుడు బండి సదానందంయాదవ్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామిని మంచిర్యాల జిల్లా అఖిలభారత యాదవసంఘం అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయ కుడు బండి సదానందం యాదవ్, సంఘం సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిరిసిల్ల జిల్లాలో కార్యక్రమాలకు హాజరైన మంత్రిని కలిసి పలు సమస్యలు విన్నవించారు. త్వరలోనే మంచిర్యాల జిల్లాలో యాదవ సంఘం సమావేశం నిర్వహిస్తున్నామని మంత్రికి తెలిపారు. యాదవులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రకారంగా అవకాశాలు కల్పించాలని కోరారు. తాము చెప్పిన విషయాలన్నింటికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సదానందం తెలిపారు.

హద్దురాళ్లు తొలగింపు

బెల్లంపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎర్రగుంట చెరువు శిఖం భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి పెన్సింగ్ పోల్స్ వేయడంతో విచారణ చేపట్టిన అధికారులు బుధవారం తొలగించారు. అలాగే రెవెన్యూ అధికారులు ఎర్రగుంట చెరువు హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. ఎవరైన చెరువు శిఖం భూమిని కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ క్రిష్ణ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

జన్నారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విశ్రాంతి ఉద్యోగుల కార్యవర్గాన్ని సంఘ కార్యాలయంలో బుధవారం కగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూమన్న, కార్యదర్శిగా పుల్లయ్య, కోశాధికారిగా రాజయ్య, అసోసియేషన్ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, సహ అధ్యక్షుడిగా బుచ్చయ్య, ఉపాధ్యక్షులుగా శారద, జాయింట్ ఆర్గనైజర్‌గా భాస్కర్, సెక్రెటరీగా చరణ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు పోరాడుతామని తెలిపారు.

రాయితీ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

జన్నారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందజేస్తామని ఏవో సంగీత తెలిపారు. బ్యాటరీస్ప్రేయర్ ఆపరేటర్, పవర్ సప్లయిర్, రోటివేటర్, సీడ్, పర్టిలైజర్ డ్రిల్, డెస్క్, ఆర్‌వో, పవర్ ట్రిల్లర్, పవర్ వెండర్, బుస్‌కట్టర్‌లు ఉన్నాయని ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భావానికి ప్రతిరూపమే ఛాయాచిత్రం


మేదరిపేటలో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దండేపల్లి సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భావానికి ప్రతిరూపమే ఛాయాచిత్రమని, వేల పదాలు చెప్పలేని భావాన్ని ఒక ఫొటో చెబుతుందని తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో ట్రేడ్ ఎక్స్ పో పోస్టర్లను బుధవారం తిరుపతి చేతుల మీదుగా సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో ఓం కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్ పో కార్యక్రమానికి విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫోటోస్టూడియో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శు అప్పను రామన్న, శ్వాస తిరుపతి, మండల అధ్యక్షుడు బోడకుంట మహేందర్, నాయకులు రవీందర్, సురేష్, సత్యం, తిరుపతి, కుమారస్వామి, వేణు, కిషన్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: లక్షెట్టిపేట మండల ఫొటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటో ట్రేడ్ ఎక్స్ పో పోస్టర్ల తహసీల్దార్ దిలీప్‌కుమార్ చేతుల మీదుగా సంఘ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శు అప్పను రామన్న, పోతరవేణి శ్వాస తిరుపతి, జిల్లా నాయకులు రవీందర్, సురేష్, సత్యం, లక్షెట్టిపేట మండల అధ్యక్ష కార్యదర్శు బొప్పు శ్రీనివాస్, మామిళ్ల సురేష్, నాయకులు వీనీత్, మల్లేష్, టీమేష్ తదితరులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా విడుదల

హాజీపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాల్లో ఫొటోలతో కూడిన తుది ఓటర్ జాబితాను ప్రదర్శించారు. జడ్పీసీఈవో గణపతి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయాల్లో తుదిఫొటో ఓటరు జాబితాలను ప్రదర్శించారు. జిల్లాలోని 16 మండలాల్లో 16 జడ్పీటీసీ, 129 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 713 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 3,76,676 మంది ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు 1,91,015 మంది, పురుష ఓటర్లు 1,85,646 మంది, ఇతర ఓటర్లు 15 మంది ఉన్నట్లు తెలిపారు.

కాసిపేట: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా తుది ఫొటో ఓటరు జాబితాను ఎంపీడీవో సత్యనారాయణసింగ్ బుధవారం విడుదల చేశారు. ఎంపీవో సప్దర్ ఆలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

హాజీపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొనబండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించా లని బుధవారం యుఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంచిర్యాల డిపో ఆర్టీసీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు మిట్టపల్లి తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి అల్లం సాయితేజ, సాత్విక్, అక్షయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు బహిరంగ వేలం

జైపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కంటి, వెంకట్రావుపల్లి, నర్సింగాపూర్, గంగిపెల్లి, కిష్టాపూర్, రొమ్మిపూర్, నర్వా, టేకుమట్ల గ్రామపంచాయతీల పరిధిలోని చేపలు పట్టడానికి చెరువులకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించామని జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ పేర్కొన్నారు. వేలంలో నర్వ చెరువుకు రూ. 12 వేలు, కిష్టాపూర్ చెరువుకు రూ. 9,535, రొమ్మిపూర్ చెరువుకు రూ. 9,535 సభ్యులు వేలం పాటలో గెల్చుకున్నారన్నారు. మిగితా గ్రామాల్లో ఎవరు ముందుకు రాలేదన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

భీమిని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లీడి గ్రామంలో శనివారం అక్రమంగా ఇంట్లో నిల్వఉంచిన ఐదు లీటర్ల గుడుంబా పట్టుకున్నటు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన కోట ఇస్తారి ఇండ్ల వద్ద గుడుంబా అక్రమంగా నిల్వఉన్నట్లు సమాచారం రావడంతో ఇంటిపై సోదాలు నిర్వహించి పట్టుకున్నామన్నారు.. దాని విలువ రూ.2000 రూపాయలు ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుంన్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగు పాటుకు గేదె మృతి

దండేపల్లి సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన అనవేని శంకరయ్య అనే రైతు చెందిన గేదెపై పిడుగు పడి మృతి చెందింది. బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో పాటు పిడుగు వేడయంతో నాగసముద్రం గ్రామంలో ఓ చెట్టు కింద కట్టేసిన బర్రెపై పిడుగుపడటంతో అక్కడిక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ. 60వేలు ఉంటుందని బాధిత రైతు శంకరయ్య తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం

మందమర్రిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నారం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఉపాధ్యాయుడు తినుమల్ల శ్రీనివాస్ జైపూర్‌కు బదిలీ కాగా బుధవారం పాఠశాలలో ఎంఈవో దత్తుమూర్తి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెకండ్ హెచ్‌ఎం రాపిల్‌రెడ్డి, నరేందర్, శ్రీనివాస్, స్వరూప్, మాదేష్, శ్రీనివాస్,సుమలత, సంతోష్, శ్రీనివాస్,జనార్ధన్, నాగరాజు, ఈద లింగయ్య పాల్గొన్నారు.

ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ మీట్‌కు ఎంపిక

దండేపల్లి సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ మీట్‌కు మంచిర్యాల జిల్లా తరుపున 100 మీటర్ల పరుగు పందెంలో రెబ్బనపల్లి ప్రభుత్వపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గాజుల శ్రీనివాస్ మొదటి స్థానంలో నిలిచారు. డిసెంబరు నెలలో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరగబోయే ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌నకు రాష్ట్రం తరుపున పాల్గొంటారని డీవైఎస్‌వో హనుమంత్‌రెడ్డి తెలిపారు. డీఈవో యాదయ్య, ప్రధానోపాధ్యాయుడు మంత్రి రాజు, ఎస్‌జీఫ్ కార్యదర్శి ఎండీ యాకుబ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, సిరంగి గోపాల్ అభినందించారు.

సీపీగెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంక్

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీపీగెట్ ఫిజిక్స్‌లో రాష్ట్రస్థాయి 26వ ర్యాంక్ సాధించిన దుర్గం శంకర్‌ను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటపల్లి గ్రామ పాలన అధికారుల నియామకం

కోటపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి మండలానికి తొమ్మిది మంది గ్రామపాలన అధికారులను ప్రభుత్వం నియమించింది. వారు బుధవారం తహసీల్దార్ రాఘవేందర్‌రావుకు నియామక ఉత్తర్వులను అందించారు. సిర్సా క్లస్టర్‌కు పిర్సింగుల మోహన్, కొల్లూరు క్లస్టర్‌కు జుమిడె రాజన్న, పారుపెల్లి క్లస్టర్‌కు ఇప్ప హరీష్‌కు, కోటపల్లికి రాదండి మల్లక్క, కొండంపేటకు దుర్గం గంగారాం, మల్లంపేటకు షేక్ హఫీజ్, సూపాకకు షేక్ అస్గర్ అలీ, షెట్‌పల్లికి గజెల్లి తిరుపతి, లింగన్నపేట క్లస్టర్‌కు కోట దుర్గయ్య గ్రామపాలన అధికారులుగా నియామకం అయ్యారు.

పదోన్నతి పొందిన వెటర్నరీ సిబ్బందికి సన్మానం

దండేపల్లి సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపేట పశువైద్య ఉపకేంద్రంలో ఎల్ఎస్‌ఏగా పనిచేసిన తిరుపతి జేవివోగా, గూడెం పశువైద్య ఉపకేంద్రంలో పనిచేసిన ఎండీ సాధిక్ వీఏగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారిని సత్కారించారు. బుధవారం దండేపల్లి పశు వైద్యశాల కేంద్రంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్, సిబ్బంది ఆధ్వర్యంలో వారిని వీడ్కోలు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, బొడు కమలాకర్, నాయకులు సతీష్, రవి, సత్తయ్య,గంగన్న,శ్రీనివాస్, పశువైద్యాధికారి సుజాత, సిబ్బంది సత్తయ్య, శ్రీనివాస్, ప్రభు, కుమార్ పాల్గొన్నారు.

తగ్గనున్న వాహనాల ధరలు

(5వ పేజీ తరువాయి)

నిర్ణీత గడువు తరువాత కొనుగోళ్లు ఊపందుకునే అవకాశం ఉంది. అలాగే మధ్యతరగతి వారు ఉపయోగించే 10 లక్షల రూపాయలలోపు ధరలు గల కార్లపైనా లక్ష రూపాయల వరకు ధరలు తగ్గే అవకాశం ఉండటంతో వాటి కొనుగోళ్లు కూడా అధికంగా ఉంటాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- **పాత వాహనాల విక్రయాలపై తీవ్ర ప్రభావం...**

జీఎస్టీ కొత్త శ్లాబులు అమలు కానుండటంతో సెకండ్ హ్యాండ్ వెహికిల్ మార్కెట్‌పైనా తీవ్ర ప్రభావం పడింది. ద్విచక్రవాహనాల ధరలు కనీసం 10,000 రూపాయల వరకు తగ్గనుండటంతో పాత వాహనాలు కొనుగోలు చేయాలనే ఆలోచనతో ఉన్న వినియోగదారులు తమ నిర్ణయాన్ని మార్చు కుంటున్నట్లు తెలుస్తోంది. రూ. లక్ష విలువ చేసే కొత్త బైకు సెకండ్ హ్యాండ్‌లో 70,000 రూపాయల వరకు అందుబాటులో ఉంటుంది. కొత్త వాహనం ధర 10,000 మేర తగ్గనుండటంతో మరో 20,000 వెచ్చిస్తే ఏకం గా కొత్త ద్విచక్రవాహనం కొనుగోలు చేయవచ్చుననే ఆలోచనతో ఉన్నా రు. అలాగే కార్ల ధరల్లోనూ భారీగా తగ్గింపులు ఉండనుండటంతో సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకాలు పూర్తిగా మందగించాయి. 10 లక్షల రూపాయల విలువ చేసే ప్రీమియం వెరైటీ కారు ధరలో తగ్గించిన జీఎస్టీ స్లాబు ప్రకారం 10 శాతం కింద లక్ష రూపాయల వరకు తగ్గనుంది. ఆ స్థాయి సెకండ్ హ్యాండ్‌లో ఆరు లక్షల రూపాయల నుంచి ఏడు లక్షల రూపాయల మధ్య లభిస్తుంది. కొత్త కారుపై కనీసం లక్షరూపాయలు తగ్గుముఖం పడు తుండటంతో తొమ్మిది లక్షల్లో లభిస్తుంది. మరో రెండు లక్షల రూపాయలు వెచ్చిస్తే కొత్త వాహనం వస్తున్నందున సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోలు ఆలోచనలు విరమించుకుంటున్నారు. ఇలా జీఎస్టీ తగ్గుదలతో సెకండ్ హ్యాండ్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబుల్లో మార్పులు ప్రకటించినప్పటి నుంచే పాత వాహనాల కొనుగోళ్లు మందగించినట్లు సెకండ్ హ్యాండ్ వాహనాల విక్రేతలు వాపోతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తాండూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో మల్లేశం బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న కృష్ణ, సాంబమూర్తి, గఋపతిలతో పాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న సుమన చైతన్యను తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శ్రీనివాస్, ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి

తాండూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాండూర్‌కు వెళ్లేందుకు సర్వీసు రోడ్డును నిర్మించాలని కోరుతూ మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ బుధవారం తాండూర్ పెట్రోల్ బంక్ దగ్గర నేషనల్ హైవే ప్రాజెక్టు ఆఫీసర్‌ను కలిసి విన్నవించారు. సర్వీసు రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ప్రాజెక్టు ఆఫీసర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట నాయకులు తిరుపతి, నవీన్ పటేల్ తదితరులు ఉన్నారు.

పెత్తందారుల అణిచివేతను ప్రశ్నించిన చాకలి ఐలమ్మ


దండేపల్లి, మందమర్రిలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ భూ పోరాట ఉద్యమంలో కీలక పాత్ర పోషించి పెత్తందారుల అణిచివేతను ప్రశ్నించిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి ని వాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతులు అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, అధికారులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు ప్రకాష్, జయరావు, మల్లయ్య, కుమారస్వామి, రాజేందర్, పోశం పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ (ఆర్‌జీపీఆర్ఎస్) జిల్లా అధ్యక్షుడె గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న, మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతి, మాజీ ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, ముత్తె రాజన్న, వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు అల్వాల సత్యం, నాయకులు వెంగళ్‌రావు, లక్ష్మీనారాయణ, సత్యం, వెంకటేష్, గౌర య్య, సతీష్, మధు, దయాకర్, రవి, వసంత్, తిరుపతి, భూమేష్, రాజలింగు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్: నస్పూర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నాయకులు సంగెపు ఎల్లయ్య, తంగళ్లపల్లి తిరుపతి, శ్రీకాంత్, ముప్పు చంద్రయ్య, రాజయ్య, శంకర్, ఓరగంటి ఎల్లయ్య, ముప్పు రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలో జరిగిన కార్యక్రమంలో రజకవృత్తి దారుల సంఘం నాయకులు గంగురాజు రాంచంద ర్, పాయిరాల రాములు, ముస్కు చందర్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: తాండూర్ ఐబీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు నానయ్య, శంకర్, రాజేశం, బాపు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృత్యువాత

హాజీపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్‌లో వీధి కుక్కలు గొర్రెల మందపై దాడిచేయడంతో ఏడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గుండెల రమేశ్ అనే గొర్రెల కాపరి రోజువారీగా గొర్రెల మందను మేతకు తీసుకెళ్లాడు. తన భార్య కూలీ పనులకు వెళ్లింది. ఇంటి దగ్గర దొడ్డిలో ఏడు గొర్రెపిల్లలను, మూడు గొర్రెలను ఉంచారు. బుధవారం మధ్యాహ్నం వీధి కుక్కలు గొర్రెల దొడ్డిలోకి చొరబడి విచక్షణరహితంగా దాడిచేయగా ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మూడు గొర్రెలకు గాయాలయ్యాయి. చనిపోయిన గొర్రెల విలువ రూ.70వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల కాపరి కోరుతున్నారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువ ఉందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, గ్రామస్థులు తెలిపారు.


మృతి చెందిన గొర్రెలు

మందమర్రిలో భారీ వర్షం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉరుములతో పిడుగుల శబ్దం చేస్తూ వర్షం పడింది. ఉదయం పూట తీవ్రఎండ ఉండగా సాయంత్రం ఐదు గంటల వర్షం కురిసింది. దీనితో పట్టణంలోని రోడ్లపై వరదనీరు ప్రవహించింది. పట్టణాన్ని ఆనుకొని సుంకరిపల్లి వాగులో వరదనీటి ఉధృతికి దారితెగిపోయి రాకపోకలు నిలిచి పోయాయి. లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరుకుంది. స్థానిక రెండో జోన్‌లోని సింగరేణి క్వార్టర్లకు వరదనీరు చేరింది. పట్టణంలోని పాలవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.


రోడ్లపై పారుతున్న వరద నీరు, వర్షం ధాటికి కొట్టుకుపోయిన శంకర్‌పల్లి రహదారి

అనుమానాస్పద స్థితిలో నానమ్మ, మనువరాలు మృతి

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడలో బెజ్జాల సత్యవతి(54), గీతాశీరీషా(4) అనే నానమ్మ మనువరాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. స్థానికులు, మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యవతికి ఇద్దరు కుమారులు కాగా, ఒక కుమారుడు హిజ్రాగా మారాడు. మంచిర్యాల పట్టణంలోని గోపాలవాడలో ఇంటిని నిర్మించుకొని జీవనం సాగించాడు. కొంతకాలం క్రితం మృతి చెందాడు. దీంతో సత్యవతి ఆ ఇంటిని అమ్మేందుకు కుమారుడు గంగోత్రి, మనువరాలు శిరీషతో కలిసి ఇల్లు అమ్మకం కోసం ఖమ్మం నుంచి మంచిర్యాలకు వచ్చారు. గంగోత్రికి ఆరోగ్యం బాగలేకపోవడంతో ఖమ్మంకు తిరిగి వెళ్లిపోయాడు. బుధవారం తల్లికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో పక్కింటివారికి ఫోన్ చేశాడు. గది తలుపులు వేసి ఉండగా ఎంత పిలిచిన వారు పలుకగా పోవడంతో పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది తలుపులు తెరిచిచూడగా మంచంపై సత్యవతి, గీతాశిరీష అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నారు. వీరు ఆత్మహత్య చేసుకున్నారా లేదా హత్య చేయబడ్డారా అనేది దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఖమ్మం నుంచి కుమారుడు రావాల్సి ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు.

- జిల్లాలో నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు
- ఏళ్లుగా పని చేయని పంపులు
- మరమ్మతులపై పట్టింపు కరువు
- ఆయకట్టుకు అందని సాగునీరు
- నష్టపోతున్న రైతులు



నిరుపయోగంగా ఉన్న కోర్సిని ఎత్తి పోతల పథకం

అలంకార(ప్రాయంగా తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల పథకం

'ఉత్త' పోతలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జల వనరుల నుంచి పంటలకు సాగు నీరందించే ఉద్దేశ్యంతో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రాణహిత, పెన్‌గంగ నదుల వద్ద నిర్మించిన ఎత్తి పోతల పథకాలు ఆయకట్టుకు చుక్కనీరందించడం లేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ పథకాలతో అన్నదాతలకు ప్రయోజనం కలుగడం లేదు. కొన్ని ఎత్తి పోతల పథకాల పనులు ఏళ్ల తరబడి కొనసాగుతుండగా మరి కొన్ని మరమ్మతులకు నోచుకోక మూలకు చేరాయి. దీంతో రైతులు ఏటా నష్టాలను మూటగట్టుకుంటున్నారు. జీవనదిని తలపించే ప్రాణహిత, పెన్‌గంగలపై కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూరు(టి) మండలాల్లో తొమ్మిది ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. కౌటాల మండలంలో సాండ్‌గాం, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామాల్లో ఎత్తి పోతల పథకాలుండగా ఏ ఒక్క పథకం కూడా పని చేయడం లేదు. చింతలమానేపల్లి మండలంలోని కోర్సిని, గూడెం, రన్‌వెల్లి ఎత్తిపోతల పథకాలు పూర్తికాక నిరుపయోగంగా మారాయి.

● రూ.10 కోట్ల అంచనా వ్యయంతో..

కౌటాల మండలంలో 10వేల ఎకరాలకు ప్రాణహిత జలాలను పొలాలకు అందించేందుకు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో పదేళ్ల కిందట తుమ్మిడి హెట్టి, వీర్దండి, గుండాయిపేట, సాండ్‌గాం ఎత్తి పోతల పథ కాలు నిర్మించారు. ఇవి కొన్ని రోజు పాటు ఆయకట్టు పొలాలకు నీరందించినప్పటికీ మోటార్లు చెడి పోవ డంతో అవి అలంకార ప్రాయంగా మారాయి. దీంతో అన్నదాతల ఆశలు అడియాశలయ్యాయి. చింతల మానేపల్లి మండలంలో 8వేల ఎకరాల సాగుకు నీ రం దించే లక్ష్యంతో కోర్సిని వద్ద నిర్మిస్తున్న ఎత్తి పోతల పథకం పనులు ఎనిమిదేళ్లుగా నత్తనడక పనులు కొనసాగుతున్నాయి. రూ.40 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ పథకం నేటికి పూర్తి కాలేదు. గూడెం, రనవెల్లి ఎత్తిపోత పథకాలు సైతం నేటికి పూర్తి కాక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి ఎత్తి పోతల పథకాలకు నిధులు కేటాయించి ఉపయోగంలోకి తీసుకరావాలని ఆయ కట్టుదారులు కోరుతున్నారు.

● జిల్లాలో పరిస్థితి ఇలా..

ఆసిఫాబాద్ జిల్లాలో చివరి ఆయకట్టు వరకు రైతులకు నీరందించాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు అలంకార(ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ప్రాణహి త-పెన్‌గంగా నదుల మీద సిర్పూర్, చింతలమానేపల్లి, కౌటాల మండలాల్లో ఎత్తిపోతల పథకాలు నిర్మించినప్పటికీ అవి పనిచేయక పోవడంతో జిల్లా రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. ఇందులో సాండ్‌గాం, హడ్కిలీ ఎత్తిపోతల పథకాలు మాత్రమే పని చేస్తున్నాయి. మిగతా ఎత్తిపోతల పథకాలు పని చేయడంలేదు. మోటార్లు చెడిపోయి వాటికి ఏళ్లుగా మరమ్మత్తులు చేయకపోవడం పర్యవేక్షణ లేకపోవడంతో నీళ్లు ఎత్తిపోయడం లేదు. సిర్పూర్(టి) మండలం లోనవెల్లి ఎత్తి పోతల పథకం 1,100 ఎకరాల ఆయకట్టుకు నీరందించాలనే లక్ష్యంతో నిర్మించిన మోటార్లు చెడిపోవడంతో నిరుపయోగంగా మారింది. చింతల మానేపల్లి మండలంలో ప్రాణహిత నదిమీద రన్‌వెల్లి గ్రామం వద్ద రూ. 28 కోట్లతో 4,500 ఎకరాలకు నీరందించే లక్ష్యంతో ఈ పథకం నిర్మాణ పనులు చేపట్టగా నేటికీ పూర్తి కాలేదు. గూడెం వద్ద 2వేల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో రూ. 17.05 కోట్లతో నిర్మిస్తున్న ఈ పథకం నిర్మాణ దశలోనే మగ్గుతుంది. కోర్సిని వద్ద రూ. 40 కోట్లతో 8వేల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఈ పథకాన్ని చేపట్టినా ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం 2006లో రూ. 3కోట్లతో వేయి ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంగా నిర్మించిన మోటార్లు కాలిపోవడంతో అలంకార(ప్రాయంగా మారింది.

● ఆయకట్టుదారుల్లో ఆందోళన..

జిల్లాలో ఎత్తిపోతల పథకాల కింద భూములను సాగు చేస్తున్న ఆయకట్టు దారుల్లో ఆందోళన నెలకొంది. ఏళ్ల తరబడి ఎత్తి పోతల పథకాలు పూర్తికాకపోవడంతో పంట పొలాలకు చుక్కనీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లు వెచ్చించి పథకాలు ప్రారంభించినా అవి పూర్తి కాక పోవడంతో వర్షాధారంపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో పుష్కలంగా జల వనరులున్నా ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యంతో ఎత్తి పోతల పథకాలు పూర్తి కాక పోవడంతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఎత్తిపోతల పథకాలను మరమ్మతులు చేపడితే ఈ ప్రాంతంలో రెండు పంటలు పండించే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆయుధం చోరీ కేసులో నేవీ కానిస్టేబుల్‌తో పాటు మరొకరి అరెస్టు

పెంచికలపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన నేవీ కానిస్టేబుల్ దుబ్బుల రాకేష్, అతడి సోదరుడు ఉమేష్‌ను బుధవారం జిల్లా పోలీసుల సహకారంతో ముంబై క్రైం పోలీసులు అరెస్టు చేశారు. కుమరం భీం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికలపేట మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన దుబ్బుల రాకేష్ 2023లో నేవీలో ఉద్యోగం సంపాదించాడు. 2025 ఫిబ్రవరి వరకు ముంబైలోని నేవీ శాఖలో విధులు నిర్వహించాడు. అనంతరం బదిలీపై కేరళ రాష్ట్రం ఎర్నాకులం వెళ్లి విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 6న రాకేష్ ముంబైలోని నేవీ కేంద్రానికి వెళ్లాడు. అక్కడి సెంట్రీ రూం నుంచి తన సోదరుడు ఉమేష్ సహకారంతో ఒక ఇన్సాస్(రైఫిల్) ఆయుధం, మూడు మ్యాగ్జిన్లు, 40 బుల్లెట్లను దొంగలించి స్వగ్రామానికి వచ్చారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన ముంబై క్రైం పోలీసులు ఆధారాలను సేకరించి నిందితులిద్దరిని బుధవారం తెల్లవారుజామున కాగజ్‌నగర్ పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఇన్సాస్ (రైఫిల్) ఆయుధం, మూడు మ్యాగ్జిన్లు, 40 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషగిరి

వాంకిడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాంకిడి సబ్‌స్టేషన్‌లో అదనపు పీటీఆర్ ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన విద్యుత్ అందనుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషగిరి అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అదనపు పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాటాడుతూ అదనంగా ఏర్పాటు చేసిన పీటీఆర్ వల్ల మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఉంటుందన్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ (ఎంఆర్‌టీ) బండల వీరేశం, విద్యుత్ శాఖ అధి కారులు పంబల శ్రీనివాస్, కటం శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాల పోస్టర్ల విడుదల

రెబ్బెన, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలంలోని ఇందిరానగర్‌లో వెలసిన శ్రీ కనక దుర్గా దేవి స్వయంభూ శ్రీ మహంకాళి దేవ స్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే కోవ లక్ష్మి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్ స్వామి, ఆలయ అధ్యక్షుడు తిరుపతిగౌడ్, కమిటి సభ్యులు శ్రీకర్, రోహిత్ పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు

వాంకిడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంట చేలలో గంజాయి మొక్కలు పెంచు తున్న వాంకిడి మండల కేంద్రానికి చెందిన ఆకిరెడ్డి పోచయ్య (71), ఆర్లి గ్రామానికి చెందిన కావుడే బాజీరావు (48) పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆకిరెడ్డి పోచయ్య మండలంలోని ఆర్లి శివారులో గల చేనులో గంజాయి మొక్కలు పెంచగా కావుగే బాజీరావు గ్రామ సమీపంలోని చేనులో మొక్కలు పెంచుతు న్నట్లు వచ్చిన సమాచారం మేరకు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసునమోదు చేశామని తెలిపారు. ఎవరైన గంజాయి మొక్కలు పెంచినా, విక్రయించినా, సేవించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

చింతలమానేపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో బుధవారం పారిశు ధ్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడీఓ సుధాకర్ రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అటవీ సంపదను సంరక్షించాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపదను సంరక్షించాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ అన్నారు. తన కార్యాలయంలో జోడేఘాట్ రేంజ్‌లో ఎఫ్‌బీవోగా పని చేస్తున్న స్వప్న ఎఫ్ఎస్‌వోగా పదోన్నతి పొందిన నేపథ్యంలో బుధవారం పదోన్నతి చిహ్నాన్ని తొడిగారు. ఈ సందర్భంగా అయన మా ట్లాడుతూ పదోన్నతులు మరింత బాధ్యతలు పెంచుతాయని చెప్పారు. అటవీ సంపద రక్షణకు బాధ్యతగా పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యోగేష్ కులకర్ణి పాల్గొన్నారు.

తక్కువ ధరకు సామగ్రి అందించాలి

సిర్పూరు(టి) సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరలకు సామగ్రి అందించాలని ఆసిఫాబాద్ హౌసింగ్‌శాఖ డీఈ మహ్మద్ ఖలీమొద్దీన్ అన్నారు. సిర్పూరు(టి) తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని వివిధ వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ సామగ్రి తక్కువ ధరకు ఇచ్చేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సత్యనారాయణ, సిర్పూరు నియోజకవర్గ హౌసింగ్ ఏఈ సజియోద్దీన్ పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను వదలొద్దు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశువులను యజమానులు రోడ్లపై వదలకూడదని సీఐ బాలాజీ వరప్రసాద్ అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పశువుల యాజమానులు రెండు రోజుల వ్యవధిలో తమతమ పశువులను ఇళ్లలోకి తీసుకువెళ్లాలని చెప్పారు. లేని పక్షంలో పశువులను గోశాలకు తరలిస్తామని సీఐ తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ బాలాజీ వరప్రసాద్

విశ్వకర్మ జయంతిని విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించనున్న శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో అదిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడకలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, సురేష్ చారి, తిరుపతిచారి, మహేష్, వరప్రసాద్, శ్రీనివాస్, వెంకటయ్య, సత్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



బెజ్జూరులో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం చాకలి ఐల మ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి అధికారులు, నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తొలి తరం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం అహర్నిషలు పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మను స్మరిస్తూ కమ్యూనిటీ హాలు, చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ పోరాటం చేశారన్నారు. ఆమె స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి సజీవన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు కడతల మల్లయ్య, సంఘం నాయకులు భూమయ్య, రాజేందర్, గణపతి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్ పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య మాట్లాడుతూ దొరల వ్యవస్థను తిప్పికొట్టేందుకు పోరాటం చేసిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో పొన్న వెంకటేష్, రాకేష్, కార్తీక్, నవీన్, వెంకటేష్ పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఖాజా అజీజోద్దీన్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శ్రావణ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం



మత్స్యకారులకు పరికరాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం మత్స్యకార కుటుంబాలకు అండగా ఉంటుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం విజయ వాహిణి చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ సౌజన్యంతో మత్స్యకారులకు బోటు, వలలు, టార్చిలైట్లు ఇతర పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులకు అందిస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజయవా హిణి చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ వారు చేపలు పట్టే వారికి అత్యాధునిక పరికరాలు అందజేయడం అభినందనీయమని చెప్పారు. జిల్లా యంత్రాంగం మత్స్యకార కుటుంబాలకు ఎల్లప్పుడు తోడుగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద వివిధ వ్యాపారాలు నిర్వహించేందుకు ప్రోత్సహిస్తోందని చెప్పారు. చేపలు పట్టి మార్కెట్‌కు తరలించేందుకు స్టోరేజీ కోసం యంత్రాలను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, విజయవాహిణి చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రొజెక్టర్‌ను సద్వినియోగం చేసుకొని ఏకాగ్రతతో చదువుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌చార్జీ డీఈవో దీపక్ తివారి, భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌లతో కలిసి బుధవారం సందర్శించి భారత్ ఎలక్ట్రానిక్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్‌ను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ ఎలక్ట్రానిక్ సంస్థవారు గత ఏడాది మొబైల్ సైన్స్ వాహనాన్ని అందజేశారని అన్నారు. ఈ ఏడాది జిల్లాలోని 10 మండలాల్లో ఒక్కొక్క పాఠశాలకు ప్రొజెక్టర్లను అందజేశారని తెలిపారు. ఈ ప్రొజెక్టర్ ద్వారా అందించే విద్య బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలలో మంచి నైపుణ్యాలు అంది పుచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, భారత్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్వేరో కోర్ వారియర్స్ సేవలు విస్తరిస్తాం


కాగజ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా స్వేరో కోర్ వారియర్స్ సేవలు విస్తరిస్తామని స్వేరో చీఫ్ కమాండర్ బాబు అన్నారు. కాగజ్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు.

పీహెచ్‌సీ తనిఖీ

జైనూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మందుల కొరత, తదితర సమస్యలు ఉంటే వెంటనే తెలియపర్చాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎంవో శాంలాల్, సూపరింటెండెంట్ షఫియోద్దీన్, సీహెచ్‌వో సంపత్, హెచ్ఈవో రవిదాస్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డు.. రాకపోకలకు అవస్థలు

దహెగాం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గిరివెల్లి-ఖర్జి గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో మండల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా లోహ, దిగిడ, రాంపూర్, మొట్లగూడ, శంకరపురం, రావులపల్లి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు అదుపుతప్పి పడి పోతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం సాగించడం అంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవల్సిన పరిస్థితి ఉందని చెబుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బురదమయంగా మారిన గిరివెల్లి-ఖర్జి గ్రామాల మధ్య రోడ్డు

అంగన్‌వాడీ టీచర్‌ను బదిలీ చేయాలి



ఏసీడీపీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

వాంకిడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబెండార గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టిచర్‌ను బదిలీ చేయాలని బుధవారం గ్రామస్థులు ఏసీడీపీవో ఉమా ఫాతిమాకు వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అంగన్‌వాడీ టిచర్ సక్ర మంగా విధులకు హాజరు కావడం లేదని, బాలింతలు, గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించడం లేదని గ్రామస్థులు తెలిపారు. విధులకు హాజరుకావడంలేదని, పౌష్టికాహారం ఎందుకు అందించడం లేదని ప్రశ్నస్తే గ్రామస్థులపై, గ్రామ పటేల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తుందని అన్నారు. సక్రమంగా విధులు నిర్వహించని అంగన్‌వాడీ టిచర్‌ను బదిలీ చేసి వేరే వారిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఏసీడీపీవో గ్రామస్థులకు తెలిపారు.

ఓటరు తుది జాబితా ప్రచురణ

సిర్పూరు(టి) సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు(టి) మండలంలోని 8 ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానానికి ఓటర్లు, పోలింగ్ బూత్ జాబితాను బుధవారం ఎంపీడీవో సత్యనారాయణ ఎంపీడీవో కార్యాలయంలో నోటీసు బోర్డుపై అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 ఎంపీటీసీ, ఒక జడ్పీటీసీ స్థానానికి 22,182 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది సదాశివ్, జుబేర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

పెంచికల్‌పేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎస్సై అనిల్‌కుమార్ అన్నారు. ఎల్లూరు గ్రామంలో నిషా జోహ్రి-జగేం ద్రకుమార్ జోహ్రి మెమోరియల్ ట్రస్టు నిర్వహకులు అమిత్ జోహ్రి సౌజన్యంతో గిరిజన కుటుంబానికి చెందిన ఆత్రం అరుణకు ట్రస్టు సభ్యులతో కలిసి కుట్టు బుధవారం మిషన్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాజన్న, భుజంగరావు, సభ్యులు మహేష్‌గౌడ్, తిరుమల్‌గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సిర్పూర్(యు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం కార్యక్రమం మండల విద్యధికారి కుడ్మేత సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు, సిర్పూర్(యు) ఎస్సై రామకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు కోట్నాక దౌలత్‌రావు, ఆత్రం ఆనంద్ రావు, కోత్తురి ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.